నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 29 జూలై 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

సత్యదేవున్ని దర్శించుకున్న డీసీపీ

దండేపల్లి, జూలై28 : దండేపల్లి మండలం లోని గూడెం సత్యదేవున్ని మంచిర్యాల డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎగ్గడి భాస్కర్ ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అధికారులు డీసీపీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సీఐ అల్లం నరేందర్, ఎస్ఐ ఉదయ్‌కిరణ్, ప్రధాన అర్చకులు, అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

గూడెంలో స్వామివారిని దర్శించుకుంటున్న డీసీపీ

నిండుకుండలా 'ఎల్లంపల్లి'

హాజీపూర్, జూలై 28 : గుడిపేట శివారులోని గోదావరి నదిపై నిర్మించి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు లోకి వరద వచ్చి చేరుతుండగా, నిండుకుండలా మారింది. ఆదివారం సాయంత్రం వరకు ప్రాజెక్టు క్రస్ట్ లెవల్ 148 మీటర్లకుగాను, 147.12 మీటర్లకు చేరింది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, 17.7303 టీఎంసీలు ఉంది. మొత్తం 20,643 క్యూ సెక్కుల వరద వచ్చి చేరుతుండగా, హైదరాబాద్ తాగునీకి 331 క్యూసెక్కులు, నంది పంపు హౌజ్ నుంచి 12,600 క్యూ సెక్కుల నీటిని తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా చేరిన వరద

మంచిర్యాలలో సెల్లార్లలో ఏర్పాటు చేసిన దుకాణాలు

సెల్లార్లలో వ్యాపారాలు.. రోడ్లపై వాహనాలు

నిబంధనలు పాటించని వ్యాపారులు, భవన యజమానులు

- నోటీసులతో సరిపెడుతున్న మున్సిపల్ అధికారులు
- ట్రాఫిక్ సమస్య.. వెహికిల్ పార్కింగ్‌కు ఇబ్బందులు

మంచిర్యాలటౌన్, జూలై 28: మంచిర్యాల పట్టణంలో కమర్షియల్ బిల్డింగ్‌లో నిర్మించిన వ్యాపారులు, భవన యజమానులు నిబంధనలు పాటించడం లేదు. పార్కింగ్‌కోసం ఏర్పాటు నిర్మించుకున్న సెల్లార్ స్థలాలను దుకాణాలు, గోదాముల నిర్వహణకు కిరాయికి ఇస్తున్నారు. సెల్లార్లలో పార్కింగ్ చేయాల్సిన వాహనాలు రోడ్డుకు మధ్యన నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతున్నది. మంచిర్యాలలోని మార్కెట్‌రోడ్, స్టేషన్‌రోడ్, బస్టాండ్, గంగారెడ్డిరోడ్, మెయిన్‌రోడ్, ఐబీ చౌరస్తా ప్రాంతాల్లో వ్యాపార సముదాయాలతో పాటు రాళ్లపేటరోడ్డులో ప్రైవేట్ దవాఖానాల కోసం పెద్ద భవనాలు నిర్మించారు. వీటిలో చాలావరకు భవనాలు సెల్లార్లను కలిగి ఉన్నాయి. ఎవరూ వీటిని పార్కింగ్ కోసం వినియోగించకుండా దుకాణాలు, హోటళ్లు, తదితర వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఈ విషయంలో ఎప్పటికప్పుడు నిఘా పెట్టి చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు సెల్లార్ల విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దాదాపు 25 మంది భవన యజమానులకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రోడ్డు మధ్యలో పార్కింగ్ చేసిన వాహనాలు

చర్యలు తీసుకుంటాం

-మారుతీప్రసాద్, మున్సిపల్ కమిషనర్

సెల్లార్లలో వ్యాపారాలు సాగించే వారిని గుర్తించి వారికి నోటీసులు ఇచ్చాం. వారికి కొంత గడువు ఇచ్చాం. ఈ లోగా వారు దుకాణాలను తొలగించకపోతే మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటాం. సెల్లార్లు ఉండి వ్యాపారాలు సాగిస్తున్న ప్రతి భవన యజమానికి త్వరలో నోటీసులు ఇస్తాం. ఉద్యోగుల బదిలీల ప్రక్రియ సాగుతున్నందున కొంత ఆలస్యమవుతుంది. పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలపై ఫిర్యాదులు అందుతున్నాయి. అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతాం.

వైభవంగా గాంధారి జాతర

- ఆషాఢం బోనాల పండుగకు తరలివచ్చిన భక్తజనం
- బోనమెత్తిన ఎమ్మెల్యే వివేక్
- పోలీసుల భారీ బందోబస్తు

పాలవాగు నుంచి బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వస్తున్న భక్తులు


ఆలయంలో కొలువైన మైసమ్మ తల్లి

రామకృష్ణాపూర్, జూలై 28 : మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామం,క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 9వ వార్డులో మంచిర్యాల-చంద్రపూర్ జాతీయ రహదారి పక్కన కొలువుదీరిన గాంధారి మైసమ్మ జాతర ఆదివారం అంగరంగ వైభవంగా సాగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆషాఢమాసం బోనాల పండుగ నిర్వహించగా, భక్తజనం తరలివచ్చి దర్శించుకున్నది. గాంధారిఖిల్లాలోని కోట మైసమ్మకు ప్రత్యేకపూజలు నిర్వహించి పసుపు, కుంకుమ తీసుకొచ్చి గాంధారివనం సమీపంలో కొలువైన మైసమ్మ ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, భక్తులు బొక్కలగుట్ట పాలవాగు నుంచి డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా వెళ్లి 108 బోనాలకు పూజలు చేశారు. డప్పుచప్పుళ్లు, శివసత్తులు, జోగినీలు, భక్తుల నృత్యాల మధ్య ఎమ్మెల్యే వివేక్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మాజీ జడ్పీ వైస్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, 9వ వార్డు కౌన్సిలర్ పారిపెల్లి తిరుపతి, ఆలయ కమిటీ సభ్యులు బోనాలతో వచ్చి అమ్మవారికి సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో గాంధారి వనంలోని చిల్డ్రన్ పార్కు నిండిపోయింది. బొక్కలగుట్ట పాలవాగు వరకు భక్తులు కుటుంబాలతో విడిది చేసి వంటావార్పు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు. కాగా, ఎమ్మెల్యే వివేక్ బోనమెత్తుకొని పది అడుగులు వేశారు. ఆపై అక్కడి నుంచి ఆలయానికి చేరుకొని మైసమ్మను దర్శించుకొని వెళ్లిపోయారు. పోలీసు అధికారులు ఆయన వెంటే వెళ్లడంతో బోనాలు ఎత్తుకొని వస్తున్న భక్తులకు ఆ దశలో రక్షణ కరువైంది. బోనాల ప్రదర్శన (ఊరేగింపు) ఒకరిమీదొకరు పడినంతపనైంది. దీంతో కొందరు బోనాలు ఎత్తుకున్న భక్తులు రక్షణ కల్పించాలని అధికారులతో వాదనకు దిగారు. చివరకు పోలీసుల రక్షణలో ఆలయం చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కోడితో మొక్కులు చెల్లిస్తున్న భక్తుడు

బోనం ఎత్తుకున్న చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

భారీగా పోలీసు బందోబస్తు

జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటలు జరుగకుండా బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఉదయం నుంచే సీఐ శశిధర్ రెడ్డి,రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్ ఎలాంటి అవాంఛనీయ ఘటనల జరుగకుండా పర్యవేక్షించారు. మందమర్రి తహసీల్దార్ చంద్రశేఖర్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ ఎన్. మురళీకృష్ణ, కౌన్సిలర్లు పారిపెల్లి తిరుపతి, ఆలయ కమిటీ అధ్యక్షుడు సమ్మయ్య, సభ్యులు బీమ సుధాకర్, కందునూరి రాజన్న, వేనెంక కుమార్, సత్యనారాయణ, కనకయ్య, గుండ మల్లేశ్ పాల్గొన్నారు.

ప్రతిపక్ష ఎమ్మెల్యేలా.. నో ప్రొటోకాల్, నో ఎస్కార్ట్



కుమ్రం భీం ఆసిఫాబాద్, జూలై 28 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కనీస గౌరవం దక్కడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో చేపడుతున్న ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికార పార్టీ నాయకులకు ఎలాంటి ప్రొటోకాల్ లేకపోయినా... అధికారులు రాచమర్యాదలు చేస్తుండగా, ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కనీస సభా మర్యాదలు పాటించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీజేపీకి చెందిన సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్కార్ట్‌ను తొలగించింది. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల పర్యటనలకు సంబంధించిన సమాచారాన్ని ఆయా పోలీస్‌స్టేషన్‌లకు ముందుగానే ఇస్తున్నప్పటికీ ఎస్కార్ట్‌గా పోలీసులు రావడం లేదు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు ఎమ్మెల్యేలకు సమాచారం ఇస్తున్నప్పటికీ... అక్కడికి వెళ్తే కనీసం ప్రొటోకాల్ పాటించడం లేదు. అధికారిక కార్యక్రమాలను కాంగ్రెస్ పార్టీ సభలుగా నిర్వహిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ఆసిఫాబాద్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించగా, వివాదాలకు దారితీశాయి. ఎలాంటి ప్రొటోకాల్ లేని కాంగ్రెస్ నాయకులు ప్రారంభోత్సవాల్లో పాల్గొంటే తనకు కనీసం ప్రొటోకాల్ ఇవ్వలేదని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆరోపించారు. కోవ లక్ష్మి చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆసిఫాబాద్ పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. బీజేపీ పార్టీ నుంచి గెలుపొందిన సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుకు కూడా ప్రభుత్వం ఎస్కార్ట్‌ను తొలగించింది. సిర్పూర్ నియోజకవర్గంలో తన పర్యటనలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు ముందుగానే ఇస్తున్నప్పటికీ తనకు ఎలాంటి ఎస్కార్ట్ ఏర్పాటు చేయడం లేదని ఎమ్మెల్యే హరీశ్ బాబు ఆరోపించారు.

ఈ నెలాఖరుకల్లా వన మహోత్సవ లక్ష్యం పూర్తి

ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 28 : ఈ నెలాఖరుకల్లా 53 లక్షల మొక్కలు నాటి వన మహోత్సవం లక్ష్యాన్ని పూర్తి చేస్తామని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పీటీజీ కళాశాలలో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ అధ్యక్షతన నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, డీటీడీవో రమాదేవి, మున్సిపల్ కమిషనర్ భుజంగరావుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వారితో కలిసి మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 50 శాతానికి పైగా మొక్కలు నాటినట్లు తెలిపారు. రోడ్లకు ఇరువైపులా, అన్ని కార్యాలయాల్లో మొక్కలు నాటేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నాటిన ప్రతి మొక్కనూ బతికేలా చూడాలన్నారు. ప్రతి ఇంటికి 6 మొక్కలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ రేంజ్ అధికారి అప్పలకొండ, డిప్యూటీ రేంజ్ అధికారి యోగేశ్, స్థానిక సీఐ సతీశ్, జీసీడీవో శకుంతల, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అధికారులు

శ్రీరాంపూర్ ఆర్‌కే-5 గనికి జాతీయ స్థాయి అవార్డు

సీసీసీ నస్పూర్, జూలై 28: దేశవ్యాప్తంగా బొగ్గు గనులకు ఇచ్చే జాతీయ స్థాయి అవార్డును శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే-5 గని కైవసం చేసుకున్నది. ఆదివారం కోల్‌కతాలో జాతీయ స్థాయి అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. మైన్ సేఫ్టీ అవార్డు-2024లో భాగంగా ఆర్‌కే-5గనికి కోల్ అండర్ గ్రౌండ్ స్మాల్ క్యాటగిరీ అవార్డు దక్కింది. ఈ నెల 19న తనిఖీ బృందం సభ్యులు ఆర్‌కే-5గనిని సందర్శించారు. ఈ సందర్భంగా గనిలో పని పద్ధతులు, రక్షణ, ఉద్యోగులు పాటిస్తున్న ఎస్‌వోపీలు, రికార్డులను పరిశీలించారు. గనిలో పని పద్ధతులు నచ్చడంతో వారు ఆర్‌కే-5గనికి మొదటి స్థానం కోసం సిఫార్సు చేశారు. దీంతో ఆర్‌కే-5గనికి దేశంలోనే కోల్ అండర్ గ్రౌండ్ స్మాల్ క్యాటగిరీ కింద జాతీయ స్థాయిలో మొదటి అవార్డు వచ్చింది. మైనింగ్ డీజీఎంఎస్ ప్రభాత్‌కుమార్ చేతుల మీదుగా సింగరేణి సంస్థ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, గని మేనేజర్ అబ్దుల్ ఖాదీర్ అవార్డు అందుకున్నారు. సింగరేణి సంస్థకు జాతీయ స్థాయిలో అవార్డు రావడంపై సీఎండీ బలరాం, డైరెక్టర్లు ఎన్‌వీకే శ్రీనివాస్, సత్యనారాయణరావు, తెలంగాణ ప్రాంతానికి చెందిన కోలిండియా టెక్నికల్ డైరెక్టర్ వీరారెడ్డి, శ్రీరాంపూర్ సంజీవరెడ్డి, ఏజెంట్ ఏవీ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

అవార్డు అందుకుంటున్న సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, గని మేనేజర్ అబ్దుల్ ఖాదీర్

దహెగాం, జూలై 28 : తొండల మాదిరిగా ఉండి, రంగులు మార్చే వాటిని ఊసరవెల్లి అంటారు. ఇవీ శత్రువుల నుంచి రక్షణ పొందేందుకు రంగులు మార్చుతూ ఉంటాయి. ఒకప్పుడు సాధారణంగా కనిపించే ఊసరవెల్లులు కాలానుగుణంగా అరుదుగా కనిపిస్తున్నాయి. ఆదివారం దహెగాం మండల కేంద్రంలోని ఒకరి ఇంటి ముందున్న పందిరిపై కనిపించిది. దీనిని చూసేందుకు చిన్నారులతోపాటు పెద్దలు కూడా ఆసక్తి చూపారు.

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ప్రజారోగ్యానికి పెద్దపీట వేయాలి

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 28 : ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందిన ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు మరింత చొరవ చూపాలన్నారు. లక్షల్లో ఖర్చుపెడితే వేళల్లో ప్రభుత్వం మంజూరు చేయడం దారుణమని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడాలని పేర్కొన్నారు. ప్రవేట్ హాస్పిటల్‌లో చికిత్స చేసుకున్న బిల్లులపై కనీసం 70 శాతం అయినా మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో పోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, కర్నాదం సంజీవ్, పార్టీ మండల అధ్యక్షుడు జాబరే రవీందర్, మాజీ జడ్పీటీసీ అజయ్, మాజీ ఎంపీపీ సౌందర్య, ఏఏసీ మాజీ చైర్మన్ వనజా, మాజీ సర్పంచులు బుసి భీమేశ్, శ్రీనివాస్, కిష్టయ్య, అయ్యూబ్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

రెబ్బెన, జూలై 28 : గంగాపూర్ గ్రామానికి చెందిన అదే సాగర్, మాదని జైరాం, గుర్లే రాంబాయికు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అందించారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, మాజీ ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, మాజీ ఎంపీటీసీ సంగం శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్ పర్లపల్లి వనజ, బీఆర్ఎస్ నాయకులు పందిర్ల మధునయ్య, జుమ్మిడి ఆనందరావు ఉన్నారు.

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679